# ఇంజినీర్లకు అవగాహన తప్పనిసరి

**తేలప్రోలు(హనుమాన్‌జంక్షన్), న్యూస్‌టుడే:** ఆధునిక మానవ జీవితంలో ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం అనివార్యమైన ఈ రోజుల్లో ఇంజినీర్లందరూ పీసీబీల రూపకల్పనపై అవగాహన పెంచుకోవడం తప్పని సరి అని మైక్రోలింక్ పెరిఫెరల్స్ అధినేత గోవిందరావు అన్నారు. తేలప్రోలు ఉషారామ పాలిటెక్నిక్‌కళాశాలలో 'పీసీబీ డిజైను- ప్రాథమికాంశాలు' పై నిర్వహించిన రెండురోజుల శిక్షణ కార్యశాలకు ఆయన ప్రధాన సాంకేతిక సలహాదారుగా వ్యవహరించారు. జంతువుల శరీరాలకు అస్థిపంజరం లాగే ఎలక్ట్రానిక్ పరికరాలకు 'ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్' లేదా 'పీసీబీ' మూలచట్రంగా ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యశాలలో ఉషారామ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 150మంది విద్యార్థులతో పాటు, జిల్లాలోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 50మంది విద్యార్థులు కూడా శిక్షణ పొందారు.



ఉషారామ కార్యశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కార్యశాలలో భాగంగా పీసీబీలకు సంబంధించిన ప్రాథమికాంశాలలో విద్యార్థులకు ప్రదర్శనాపూర్వకంగా అవగాహన కల్పించారు. కొన్ని ప్రధాన నమూనాలను విద్యార్థులతో తయారు చేయించారు. విద్యార్థులలో ఉపాధి నైపుణ్యాలను పెంచడమే లక్ష్యంగా కార్యశాలలను నిర్వహిస్తున్నట్లు ఉషారామ ఇంజినీరింగ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ డా॥వి.రాజేష్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ సుంకర రామబ్రహ్మం చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందించారు. అసిలేటి సునీల్ కుమార్ కార్యశాలకు సమన్వయకర్తగా వ్యవహరించారు.